# బలార్‌షా నుంచి నాగపూరు దాక...

**బతుకు బండికి ఎన్నెన్నో మజిలీలు. వాటిలో ఎదురయ్యే సుఖదుఃఖాలు, ఆనందాలు, ఆవేదనలకు కుమిలిపోయే బదులు కార్యసాధనే ఉత్తమం**

బలార్‌షా స్టేషన్‌లో బండి ఎక్కింది ఆమె, ఆ కంపార్ట్‌మెంట్ లోనికి. రావు కూర్చున్న బెర్త్ వంక ఆశగా చూసింది.

"నేను కూర్చోవచ్చునాండీ ఇక్కడ" అని అడిగింది.

ఏం సమాధానం చెప్పాలో ముందు తోచలేదు. "ఇది రిజర్వ్ కంపార్ట్‌మెంట్, ఇందులో మీరు ముందుగా టికెట్ కొనుక్కుని రిజర్వ్ చేసుకుంటే తప్ప అసలు లోపలకు అడుగు పెట్టటానికే వీలులేదు" అని సుదీర్ఘంగా ఉపన్యాసం ఇవ్వాలనిపించింది. అయినా తమాయించుకున్నాడు. ఇలాంటి నీతి సూత్రాలు పుస్తకాలలో రాసుకోవడానికే పరిమితం. ఆచరణకు వచ్చేటప్పటికి ఎందుకూ పనికిరావు అని రావు స్వానుభవంగా ఎరుగును. అందులోనూ అడుగుపెడుతున్నది మధ్యప్రదేశం నుంచి ఉత్తర హిందుస్థానం లోనికి. తనను కంపార్ట్‌మెంట్ నుంచి ఈడ్చి అవతల పారవేసినా అడిగే దిక్కూ మొక్కూ లేదు.

ఆమె - అడిగిన మనిషి అడిగినట్లుగానే అలా నిలుచుండిపోయింది, రావు అనుమతికోసం ఎదురు చూస్తూ ఉన్నట్లు.

లేత సముద్రం రంగు నీలం చీర కట్టుకుంది. కాస్త ముదురు ఆకాశ నీలం రంగు జాకెట్ వేసుకుంది. అయిదడుగుల అయిదంగుళాల మనిషి. కుదుమట్టంగా నిండుగా ఉంది.

మధ్య వయసు. ఆలోచన, సమాధాన చిత్తంతో రంగరించుకుపోయిన ముఖం. వెడల్పుగా, దాదాపు గుండ్రంగానే ఉందిగాని ముఖాన బొట్టుపెట్టుకో లేదు. ముక్కులకు బేసరి లేదుగానీ చెవులకు రెండు ఒంటిరాయి పచ్చరంగు కమలాలు వేసుకుంది. చేతిలో ఓ ప్లాస్టిక్ బుట్ట. అడుగున్నర వెడల్పు, ఒక అడుగులోతు, నాలుగు రంగుల కలగాపులగం నేత. దాని నిండా ఏవో బట్టలు కుక్కుకుంది. ఒక పక్కగా టిఫిన్ క్యారియర్ మూత, మంచినీళ్ళ బిరడా తొంగి చూస్తున్నాయి పైకి. అట్టే బరువు ఉండదుగాని, ఆడకూతుర్ని అలా నిలబెట్టి వేయడం రావుకు ధర్మం కాదనిపించింది. రిజర్వ్ కంపార్ట్‌మెంట్ లోనికి ఇట్టే జొరబడిపోయి రెండు మూడు గంటలు సునాయాసంగా ప్రయాణం చేయాలనే దురాశ ఉన్న ప్రయాణికుల పట్ల సానుభూతి లేకపోయినా రావు కొంత మెత్తబడ్డాడు.

రావు తన స్థితిని మరొకమారు పరికించుకున్నాడు.

ఒక లోయర్‌బెర్త్ మీద తానొక్కడూ బాసీపీఠం వేసుకుకూర్చున్నాడు. చదువుతూ ఉన్న పుస్తకం పక్కన - పేజీలు మధ్యకు విరిచి తెరిచి, బ్రీఫ్‌కేస్ మీద విశ్రాంతి తీసుకుంటోంది. రైలు ఆగిన తర్వాత అక్కడ పెట్టాడు. కొంతసేపు స్టేషన్ వంక, ప్లాట్‌ఫామ్ వంక చూసి సేద తీర్చుకుందాం అన్న ఆలోచనతో దాదాపు తెల్లవారిన దగ్గర నుంచీ చదువుతూనే ఉన్నాడు- ఇంకా ఎప్పటికప్పుడు నూరు పేజీలు మిగిలిపోతూ ఉన్న పుస్తకాన్ని.

ఎదురు బెర్త్‌లో రావు భార్య, మరో ప్రయాణికురాలు చెరో చివర కూర్చున్నారు. మధ్యలో ఉన్న స్థలంలో తమ వ్యానిటీ బాగ్‌లు, నేప్‌కిన్లు పరుచుకున్నారు. అందుకనే ఆమె వాళ్ళను అడగకుండా రావును అడిగింది 'కూర్చోనా' అని; అతని బెర్త్ సగానికి సగం ఖాళీగా ఉండింది గనుక! రావుది లోయర్ బెర్త్. పై బెర్తుల్లో ఇద్దరూ ఇంతకు ముందే స్టేషన్లో చెప్పాపెయ్యకుండా దిగి వెళ్ళిపోయారు. అప్పటి నుంచీ ఈ మూడు బెర్తులకు అతడొక్కడే ఏకచ్ఛత్రాధిపత్యం వహిస్తున్నట్లు లెక్క. బలార్‌షాలో ఏ 'కోటాదారుడో' వచ్చి తన హక్కు వినియోగించుకుంటాడనుకున్నాడు. కానీ ఇంతవరకూ ఎవరూ రాలేదు. ఇదుగో, ఈమె వచ్చి తన అంగీకారం కోసం ఇంకా ఎదురు చూస్తూ ఉంది. బహుశా నాగపూర్ కోటాలోగాని ఈ బెర్తులు నిండవేమో!

ఆ మాటే అన్నాడు ఆమెతో. "ప్రస్తుతానికి ఎవరూ లేరు. ఎవరన్నా రిజర్వ్ చేసుకున్నవాళ్ళు వస్తారేమో నాగపూర్‌లో" అని.

"నేను నాగపూరు దాకానేనండీ! ఎంత, రెండున్నర, మూడుగంటల్లో దిగిపోతాను" అంటూ ఆమె తన చేతిలోని ప్లాస్టిక్ బుట్ట బెర్తుకు చివర ప్రతిష్ఠించింది. రావు తనకు అనుమతి ఇచ్చినట్లే అన్న ధీమాతో.

అంతవరకూ రావు ఏం చేస్తాడో అని గమనిస్తున్న అతని భార్య అనూరాధ తాను లేచి "ఈ చోట్లో కూర్చోండి నాగపూరు దాకానే అయేట్లయితే" అంటూ తాను మాత్రం రావు పక్కన ఉన్న జాగాను ఆక్రమించేసుకుంది.

అప్పుడు చూసింది ఆమె అనూరాధ వంక కళ్ళలో కృతజ్ఞతా భావం కనపరుస్తూ. "చాలా థ్యాంక్సండీ. నాగపూర్‌లో దిగిపోతాను. మీకేం ఇబ్బంది ఇవ్వను" అంది. ప్లాస్టిక్ బుట్టను బెర్త్ మార్చింది. పక్కన ఉన్న ఆమెకు ఏమాత్రం అసౌకర్యం కలిగించకుండా బెర్తులో మూడో భాగం మటుకే తన 'అధోటి' లోనికి తీసుకుని తాపీగా కూర్చుంది.

ప్లాట్‌ఫామ్ మీద మామూలు రద్దీ, కేకలు. అయినా అంత గందరగోళం లేదు. లోపలి ప్రయాణికులు కూడా ఎక్కువగా కదలికలు చేయడం లేదు. రైలు కూతవేసి బయలుదేరడానికి సిద్ధం అవుతోంది. స్టేషన్ నుంచి ఓ ఆడగొంతు ఎనౌన్స్‌మెంట్ భారీగా వినవస్తోంది: 'ప్రయాణికులారా! శ్రద్ధగా వినండి. చెన్నై నుంచి వారణాసీ వెళ్ళే గంగా కావేరీ ఎక్స్‌ప్రెస్ మరికొన్ని నిమిషాలలో రెండో నంబరు ప్లాట్‌ఫామ్ నుంచి బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నది' అని ఇంగ్లీషులోను, హిందీలోనూ, తరువాత మరాఠీలోనూ!

రావు చేతిగడియారం వంక చూసుకున్నాడు. తొమ్మిదీ యాభై అయింది.


"పది గంటలు అయిందాండీ..." అని అడిగింది ఆమె. లేత నీలం రంగు చీర కట్టుకుని అప్పుడే తన ఆక్రమిత సీట్‌లో సెటిల్ అయిపోతూ ఉన్న మనిషి.

రావు మరొక మారు గడియారం వంక చూసుకుని పైకి మటుకు, "లేదు, ఇంకా పది నిమిషాలు ఉంది" అన్నాడు.

"ఈ రోజు రైలు సరైన టైంకే వచ్చింది" అని ఒక్క క్షణం నిదానించి రావును, అనూరాధను మరోమారు పరికించి "వారణాసి వరకూ వెడుతున్నారా అమ్మా" అంది.

అనూరాధ నవ్వుతూ "అవును, కాశీకి పోతున్నాం" అంది.

కాశీకి పోవలెనా, తీర్థము మోసుకురావలెనా అన్న పాట మళ్ళీ మనసులో మెదిలింది రావుకు. నిజానికి ఈ ప్రయాణం అనుకున్నప్పటి నుంచీ ఈ పాట అతనికి గుర్తుకు వస్తూనే ఉంది. ఏమాత్రమూ అవసరం లేకపోయినా! పాట పూర్తిగా తెలీదు కానీ, రేడియోలో భక్తిరంజని సీరీస్‌లో వెనకటి రోజుల్లో విరివిగా విన్న గుర్తు. కాశీ ప్రయాణానికి తీర్థయాత్ర, గంగాస్నానం, విశ్వేశ్వర దర్శనం- ఇలాంటివి కారణాలు కానే కావు. కేవలం 'బిజినెస్ ట్రిప్‌మీద అఫీషియల్ కార్యకలాపం మీద వెళుతున్నాడు. గంగాస్నానం చేసినా, విశాలాక్షి, అన్నపూర్ణ, విశ్వేశ్వరులను సందర్శించినా అదంతా 'ఇన్సిడెంటల్'. అంతేకానీ పనిగట్టుకు చేసేపని మాత్రం కాదు. నాలుగు రోజులు ఎలాగూ విరామం ఉన్నది గనుక వీలైతే అలహాబాద్



చిత్రాలు: నర్శిం

కూడా వెళ్ళి త్రివేణీ సంగమంలో స్నానం చేసి, కనిపించని 'సరస్వతి'ని కూడా ఊహాలోకంలో స్పర్శించి, అలాగే నెహ్రూగారి 'ఆనందభవనం' వైభవాలు కూడా పరికించాలని ఉంది. ఎక్కువగా ఆలోచించవలసిన పనిలేదు. సమకూడితే సరేసరి. లేకపోతే మరోమారు వచ్చినప్పుడు. రావు అన్ని వ్యవహారాలు అతి రికామీగా చేసే మనిషి. మనుషులు యంత్రాలలాగా పనిచేస్తున్నా జీవన వేగాన్ని అందుకోలేకపోతున్న రోజులు. ముందుకు సాగిపోవడం తప్పనిసరి. ఆ 'పోవడం'లోనే విలువలను సంతరించుకోవడం అనుకోకుండా జరిగే పని.

రైలు బయలుదేరి కొంత వేగం పుంజుకున్న తరువాత, రావు తన పుస్తక పఠనంలో చేరిపోయినా పక్కవాళ్ళని ఓ కంట కనిపెడుతూనే ఉన్నాడు. వాళ్ళ సంభాషణపై ఒక చెవిని వేసుకుంటూనే ఉన్నాడు. బొత్తిగా పూర్వ పరిచయం లేనివాళ్ళు, తాత్కాలికంగా ఆప్యాయత, ఆత్మీయత కుమ్మరించుకోవడం రావుకు అర్థంకాని ఒక జీవన విధాన పద్ధతి. రైలు దిగిపోయిన తరువాత ఎవరికి ఎవరో! కలిసి కూర్చున్న గంట, రెండు గంటల్లో మటుకు కష్టసుఖాలు కలబోసుకుంటారు. పరస్పరం సలహాలు సంప్రతింపులు చేసుకుంటారు. 'నీవే తప్ప ఇతఃపరంబెరుగ' అన్నట్లుగా మాట్లాడుకుంటారు.

కాశీలో ఎక్కడ ఉండేదీ, ఎన్ని మీటింగులు 'అడ్రెస్' చేసేదీ చెబుతోంది అనూరాధ. ఈ మీటింగులు అడ్రెస్ చేసేది తాను కాకపోయినా చేయించేది మటుకు తనేనని గట్టినమ్మకం ఆమెకు. ఆ మాటల్లో రావుకూ అంత అపనమ్మకం లేదు.

"నేను ఉండేది నాగపూర్‌లో కాదండీ, బలార్షా లోనే. ఏదో ఒకటి రెండు గంటలు అక్కడ ఉండి ఒక విషయం తేల్చుకొని, మళ్ళీ సాయంత్రానికో, తప్పితే రేపు మధ్యాహ్నానికో బలార్షా తిరిగి వచ్చేస్తాను" అంది ఆమె. అనంత లక్ష్మి.

ఆమె పేరు ఇదేనని చెప్పడం రావు స్పష్టంగా విన్నాడు. అష్టలక్ష్ముల పేర్లు అతనికి ఎరుకేగాని వాటిలో ఈ పేరు ఉన్నట్లు లేదు. ఇందులో విడ్డూరం ఏముంది? అన్ని పేర్లూ లక్ష్మిలేకదా? ప్రకృతి అంతా ఆమె అధీనంలోనే ఉంటుంది. ప్రకృతిని మించిన మరో పేరు మరో విశేషణం... ఈ భూమిమీద ఇంకేం ఉంది! భారతదేశంలో ఏమూలకైనా వెళ్ళు. లక్ష్మి పేరు మారుమోగుతూనే ఉంటుంది. ఎన్నో భాషాంతరీకరణలలో సైతం. లకుమాదేవి దగ్గరనుంచి లచ్చుతల్లి వరకూ.


అనంత లక్ష్మికి భర్త లేడు. పోయి పదిహేనేళ్ళు

> "ఇది రిజర్వ్ కంపార్ట్‌మెంట్, ఇందులో మీరు ముందుగా రిజర్వ్ చేసుకుంటే తప్ప అసలు లోపలకు అడుగు పెట్టటానికే వీలులేదు" అని ఉపన్యాసం ఇవ్వాలనిపించింది రావుకు.

అయింది. అప్పటికి పిల్లవాడికి ఎనిమిదో ఏడు, అంతే!

"అమ్మా, పదిహేనేళ్ళు కాపురం చేశాను. పెద్ద పిల్లాడు నాలుగేళ్ళు మాత్రమే బతికి కడతేరిపోయాడు. ఇప్పుడున్నవాడు రెండోవాడు. పేరుకు రెండోవాడే అయినా నాకు ఉన్నది వీడు ఒక్కడే" అంటూ అతి నిర్లిప్తంగా చెబుతోంది అనంత లక్ష్మి.

జీవితం ఎంత దారుణమైనది! ఎన్నెన్ని పాఠాలు సూటిగా మెలికలు లేకుండా చెప్పడానికి ప్రయత్నం చేస్తుంది అని మరోమారు ఆశ్చర్యాంబుధిలో మునిగిపోయాడు రావు.



"అప్పుడు నాకు ముప్పయ్యేళ్ళు. అంతే. ఇంకా కని పెంచే వయసు. వద్దనుకుని మానేశాంగాని. మాలో మారుమనువులు ఉన్నాయి. నన్ను చేసుకుంటాననీ, కుర్రవాడికి ఏ లోపం లేకుండా పెంచుతాననీ ఇద్దరు ముగ్గురు దాదాపు అయిదేళ్ళ పాటు నన్ను వేధించుకు తిన్నారు. అమ్మా! మీతో మనసు విప్పి చెపుతున్నాను. నాకు మాత్రం మారు మనువు సుతరామూ ఇష్టం లేదు, అప్పుడూ ఇప్పుడూ కూడా" అని అనంత లక్ష్మి వెనకటి రోజుల్లోకి వెళ్ళిపోయింది.

"జీవితానికి తోడు, నీడ అన్నారు. మేం కూడా పోయాక నిన్నెవరు కనిపెట్టుకు ఉంటారు? ఎవర్నో ఎంపిక చేసుకుని సుఖపడు. నీ అదృష్టం కొద్దీ మనం వెదకనక్కర్లేకుండానే వాళ్ళంతట వాళ్ళే అడుగుతున్నారు. అది నీ పుణ్యం. వస్తున్న అదృష్టాన్ని చేజేతులా వారించకు" అని మా అమ్మ, నాన్న చెవిలో గూడుకట్టుకు చెప్పారు. నా మనసు మాత్రం మారలేదు. మారనందుకు ఇప్పుడు విచారం కూడా లేదు. ఊరికే విషయం వచ్చింది గనుక జరిగిపోయిన సంగతులు కలబోసుకుంటున్నాను. మనసులో మాటలు మీకు చెబుతున్నాను. అన్నపూర్ణమ్మ తల్లిని చూడబోతున్నారు. మా అమ్మలాంటి వారని మిమ్మల్ని మరీ ముసలి మనిషిని చెయ్యలేను. నాకు పెద్ద అక్కగారు అనుకుంటాను" అని అనంత లక్ష్మి, అనూరాధ చేతులు పట్టుకు ఎంతో ఆప్యాయంగా మాట్లాడడం, అనూరాధ కళ్ళు నీళ్ళతో చెమర్చడం... ఇదంతా నాటకం అనిపించడం లేదు గాని సినిమాలో లాగా హృదయాన్ని రంగరించే సన్నివేశం రావుకు.

ఎక్కడి మనుషులు, ఎక్కడి లోకం!

ప్రపంచం అంతా ఒకటే తీరు. తమ ఇష్టానిష్టాలు ఇతరులతో పంచుకోవడం, తమ ఆలోచనలకు ఇతరుల ఆమోద ప్రమోదాలు వెదకడం- ఇదే అందరూ చేసేపని. ఎదుటి మనిషిలో తనను తాను చూసుకోవడం, అద్దంలోని ప్రతిబింబంతో ఆత్మీయంగా మాట్లాడినట్లు అరమరికలు లేకుండా ఉండడం... ఎంత పరిణతి!

మాట్లాడుతున్నప్పుడు ఆమె బుగ్గలు నిండుగా పొంగడం, పై అంచులు కళ్ళను అందుకోవాలని ప్రయత్నం చేస్తూ ఉండడం రావుకు చాలా ముచ్చటగా అనిపించింది.

మనుషులు పైకి చూడడానికి ఎంతో బోళాగా ఉంటారు, కానీ, అంతరంగంలో ఎలాంటి అనుభూతులు రంగరించుకుపోయి ఉంటాయో ఊహించలేం గదా!

"నేనేం అంత చదువుకున్నదానిని కాదు. తెలివి తేటలు ఉన్నదానిని కాదు. కొమ్మచాటున నిమ్మ పండులా ఎదిగినదాన్ని. అయినా ఒక్కమారుగా రోడ్డుమీద పడిపోయినట్లు అయింది నా పరిస్థితి. ఇంట్లో నాకు రక్షణ, భద్రత అన్నీ ఉన్నాయి. అయినా, వీధిలోకి వెళ్ళింతర్వాత ఎదుర్కోవలసిన అనేక అవస్థలు- పైకి చెప్పుకోవడానికి వీల్లేనివి. ఇతరులతో బాహాటంగా చర్చించి నిర్ణయాలు తీసుకునేందుకు వీలైనవి కాదుగదా అన్నీ! అలాగే జీవితం నెట్టుకు వచ్చాను. ఎవరిచేతా వేలెత్తి చూపించుకోకుండా అభిమానంగా కాలం గడపడానికి నేనెంత ఇబ్బంది పడ్డానో ఆ పరమాత్ముడికే తెలుసు... అయినా నేను తీసుకున్న నిర్ణయం నుంచి వైదొలగలేదు. ఇన్నాళ్ళూ, ఇన్నేళ్ళూ"

అనూరాధ ఆమె వంక చాలా అప్రీషియేటివ్‌గా చూస్తూ ఉండడం గమనించాడు రావు. ఎవరైనా అలాగే చేస్తారు. అబల, సబల అనేది కాదు ప్రశ్న ఇక్కడ. తాను నమ్మిన విషయాలకు నిలదొక్కుకు ఉండడం. పరిస్థితులు మారిపోయినాయని అభిప్రాయాలు మార్చుకోకుండా ఉండడం... ఇదీ మెచ్చుకోదగ్గ సంగతి.

"చిన్న ఉద్యోగం కూడా సంపాదించుకున్నాను. మున్సిపల్ ఆఫీస్‌లో శానిటరీ సెక్షన్‌లో చిన్న ఉద్యోగం. నాకేం అధికారాలు లేవు, అజమాయిషీ మటుకు ఉంది. వందమంది పనివాళ్ళకు శుభ్రత, ఆరోగ్యం, శుచి గురించి నచ్చచెబుతున్నట్లుగా హితోపదేశం చేయడం, వాళ్ళు నగరంలో వివిధ ప్రాంతాల్లో, నేర్చుకున్న విషయాలు అమలు చేస్తున్నారో లేదో చూడడం, పని నిర్వహణలో వాళ్ళకు ఎదురయ్యే ఇబ్బందుల్ని సమరసంగా, చాకచక్యంగా తప్పించుకొని కార్యసాధనకు అనుకూలాలు కల్పించడం... ఇదీ నా పని. జీవితంలో నాకున్న అనుభవం ఈ ఉద్యోగానికి బాగా అనుకూలించింది. ఈ ఉద్యోగం నా జీవితాన్ని చక్కగా అనుసరించింది. ఏమైతేనేం? ఎన్నో వేలమందికి లేని తృప్తి నాకు దొరికింది. జీవితంలో, ఉద్యోగంలో, చేస్తున్న పనిలో తాదాత్మ్యం, ప్రజలకు ఉపకరించే పనులు చేస్తున్నామన్న తృప్తి- ఇంతకంటే ఇంకేం కావాలి చెప్పండి" అంది అనంతలక్ష్మి.

పన్నెండు గంటలు కాబోతోంది.

"భోజనం తెచ్చుకున్నారా మీరు? ఎప్పుడు చేస్తారు" అనడిగింది.

"తెచ్చుకోలేదు. నాగపూర్‌లో ఇస్తానన్నాడు కేటరర్. పొద్దున్నే ఎక్కువగా ఫలహారం చేశాంలే" అంది అనూరాధ.

"అయితే, మీరు అనుమతిస్తే నేను భోజనం చేస్తాను" అంటూ ఆమె ప్లాస్టిక్ బుట్టలోంచి టిఫిన్ క్యారియర్, నీళ్ళ సీసా పైకి తీసుకుంది.

"అలాగే, అలాగే" అంది అనూరాధ. ఆమె భోజనం చేయడానికి తన అనుమతి ఎందుకు అని కాస్త ఆశ్చర్యపోతూనే.

"పొద్దున్నే టీ నీళ్ళు తాగాను. అంతే. ఇంటి దగ్గర ఉంటే పదిన్నర, పదకొండు గంటలకల్లా తినేస్తాను. దారిలో తిందామని చపాతీలు, సబ్జీ క్యారియర్‌లో పెట్టుకుని తెచ్చుకున్నాను. నాగపూరు వెళుతున్నది కొడుకు ఇంటికే. అయినా ఆకలిగా వెళ్ళి వాళ్ళకు ఇబ్బంది కలిగించడం ఇష్టం లేదు. నా పనులు నేను చేసుకుంటాను. ఇంకొకళ్ళ మీద ఆధారపడడం నాకు ఇష్టం ఉండదు" అంటూనే ఆమె చపాతీలు ముక్కలు చేసుకుంటూ తినడం ఆరంభించింది.

అనూరాధ టీ కుర్రాడిని పిలిచింది. అతడు రెండు కప్పులు ఆమెకు, రావుకు అందించాడు. "ఆమెకు కూడా ఓ కప్ ఇవ్వు" అంది అనూరాధ అతడితో. అనంతలక్ష్మి అప్పటికి చపాతీలు తినడం పూర్తిచేసి ఓ గుక్కెడు నీళ్ళు మాత్రం తాగి, సీసా మూత గట్టిగా బిగిస్తోంది. "ఓ కప్పు టీ తాగమ్మా" అంది అనూరాధ, అనంతలక్ష్మితో. కుర్రాడు కప్పు ఆమెకు అందిస్తున్న సమయంలోనే.

"నాకు అవసరం లేదండీ. అయినా మీరు తాగమంటున్నారు గనుక నిరభ్యంతరంగా తీసుకుంటున్నాను" అంది అనంతలక్ష్మి, కళ్ళల్లో కృతజ్ఞత నింపుకుంటూ.

"బాబుగారు ఏదో చదువుకుంటూంటే నేను అదేపనిగా బడబడ వాగుతూ ఎంత డిస్టర్బ్ చేశానో ఇందాకటి నుంచి! ఇక నుంచి నోరు మెదపనులెండి" అంది నవ్వుతూ అనంతలక్ష్మి, ఇద్దరివంకా ఆప్యాయంగా చూస్తూ.

"అదేం లేదు. అయ్యగారికి చుట్టూ ఏం జరుగుతున్నదీ పట్టదు చేతిలో పుస్తకం ఉంటే" అంది అనూరాధ, అనంతలక్ష్మి మాట్లాడడం ఎక్కడ ఆపేస్తుందో, తనకు కాలక్షేపం ఎక్కడ తగ్గిపోతుందోనన్న ఆదుర్దాతో.

రావు నవ్వి ఊరుకున్నాడు. కానీ, అలా ఊరుకోవడం అతడికే ఎబ్బెట్టుగా అనిపించినట్లుంది. ఒక నిమిషం అయిన తరువాత, "నాగపూరులో ఉన్నాడా మీ అబ్బాయి? ఏం చేస్తున్నాడు" అనడిగాడు.

అనూరాధకు కథ రెండో అధ్యాయంలో ప్రవేశిస్తున్నట్లు స్ఫురించింది. ఎక్కడ ఏ మలుపు ఎలా తిప్పాలో ఆయనకు తెలిసినట్లుగా తనకు తెలియదు అని ఆమెకు ఇంకోమారు తట్టింది.

అనంతలక్ష్మి ఇంతసేపూ తన సంగతే చెప్పింది. కొడుకును పెంచి, పెద్ద చేయడంలో పడ్డ కష్టాలు ఏకరవు పెట్టలేదు. వాడిమీద తన ఆశలు ఏమిటో, వాటిని ఎంతవరకు నెరవేరుస్తున్నాడో సూచించనే లేదు. మరో అరగంట అయితే నాగపూరు రానే వస్తుంది. అనంతలక్ష్మి దిగిపోతుంది. మళ్ళీ ఈ జన్మకు కనిపించదు, వినిపించదు.


కొడుకు ఒక్కడే ఉన్నాడని ఇంతకు ముందు చెప్పిందిగానీ, వాడిని గురించి వివరాలు, విశేషాలు ఏమీ అన్లేదు. అడుగుదామని అనూరాధకు అనిపించకపోవడం, ఇప్పుడు ఆమెకు కాస్త చిన్నతనంగానే ఉంది.

"అబ్బాయిని బాగా చదివించావా? మంచి ఉద్యోగంలో పడేయించావా" అనడిగింది తన ఉదాసీనతను కాంపెన్‌సేట్ చేయాలనే ధోరణిలో.

"అక్కడ గూడా నా చేతనైనంతా చేశాను అమ్మగారూ. నాకూ అదే తృప్తి" అని ఒక్క నిమిషం నిదానంగా ఊరకుని తరువాత అంది: "అబ్బాయి నన్ను ఉద్యోగం మానేసి తన దగ్గరకు వచ్చి ఉండమంటాడు. నాకేమో ఇష్టం లేదు. ఉద్యోగం మానేసి ఇప్పుడు నేనేం చేయాలి? చేతి నిండా పనితో ఇన్నాళ్ళూ గడిపినదాన్ని ఇప్పుడు గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోగలనా, మీరే చెప్పండి. అయినా, ఏడు వేల రూపాయలు కళ్ళ చూస్తున్నాను ప్రతి నెలా. ఎందుకది పోగొట్టుకోవడం?"

అనూరాధ రావు వంక చూసింది. అతను సన్నగా నవ్వుతున్నాడు పెదవులు దాటకుండానే.

"ఇంతకూ అబ్బాయి ఏం చేస్తున్నాడు" అనడిగింది అనూరాధ మళ్ళీ.



"ఎం.ఏ చదివించాను. చురుకైనవాడు. ఇంకా పైకి చదువుకోమన్నాను. ఇంతలో లెక్చరర్ ఉద్యోగం వచ్చింది. అదీ చేసుకుంటూనే రిసెర్చికి కూడా తయారవుతున్నాడు. వచ్చిన ఉద్యోగం పోగొట్టుకుని, పై చదువులు చేసినా కూడా మళ్ళీ అదే ఉద్యోగం కోసం ప్రయత్నం చేయాల్సి వస్తుందట అప్పుడు. అందుకని ఉద్యోగం లేకుండా చదువుకోనన్నాడు. రెండు పన్లూ చేస్తున్నాడు. ఏణ్ణర్ధం అయింది ఈ ఉద్యోగంలో చేరి. సెలవుల్లో కూడా నా దగ్గరకు వచ్చినా, ఒక్క రోజు ఉండడం మహాభాగ్యం. బండెడు పుస్తకాలు మోసుకువస్తాడు."

అనూరాధ ఆసక్తిగా వింటోంది.

"చాలా సంతోషం అనంతలక్ష్మీ. కుర్రవాడిని చక్కగా తయారుచేశావు. అందరూ నీలాంటి తల్లులు అయితే భారతదేశంలో భావి పౌరులు సార్ధకులు అవుతారు" అన్నాడు రావు.

"ఇందులో నేను చేసింది ఏమీ లేదు బాబుగారూ. అంతా వాడే నిర్ణయించుకున్నాడు. ఏం చదవాలి, ఎక్కడ చదవాలి, ఎలా చదవాలి అంతా వాడిదే. మీలాంటి పెద్దలు ఎవరైనా సలహాలు, ఆదేశాలు ఇచ్చి ఉండాలి. నాకా వివరాలు తెలియవు, అర్ధం కావు. నేను చేసిందల్లా ఒక్కటే- వాడిని చదువుకుందుకు ప్రోత్సహించడం, వాడు అడిగిన డబ్బు సప్లయి చేయడం. అంతే. అంతే బాబుగారూ."

"అంతకంటే ఇంకేం కావాలి? నీ సపోర్ట్ లేకపోతే వాడు అన్నీ తీర్చి దిద్దుకోవడం కుదిరేదా" అంది అనూరాధ.

"డబ్బు సప్లయి చేయడం కూడా వాడు చదువుకుంటున్నన్నాళ్ళే అమ్మా. వాడు ఉద్యోగం చేయడం మొదలు పెట్టిన తర్వాత నా దగ్గరో రూపాయిబిళ్ళ కూడా తీసుకోలేదు. పైగా, ప్రతి నెలా ఓ వెయ్యి రూపాయలు పంపడం మొదలుపెట్టాడు. నాకెందుకు డబ్బు? నా జీతం చాలకనా? 'వద్దురా బాబూ' అన్నా వినకుండా ప్రతి నెలా నా చేతుల్లో పెట్టి వెళ్ళేవాడు."

"పోన్లే, వాడి సంతోషం వాడిది. హాయిగా ఖర్చు చేసుకో" అంది అనూరాధ.

"నాకేం ఖర్చులుంటాయి అమ్మగారూ. పిల్లవాడు ఊరికే ఇస్తున్నాడుగదా అని నేను ఇప్పుడు పట్టుచీరలు కొనుక్కుని కట్టుకునేదా? అయినా, వాడి మనసు కష్టపెట్టడం ఇష్టం లేక వెయ్యి రూపాయలూ పుచ్చుకుంటున్నాను. ఏ నెలకు ఆ నెల పోస్ట్ ఆఫీస్‌లో వాడి పేరే డిపాజిట్ చేస్తున్నాను. వాడికి తెలియకుండా వాడి డబ్బు పెరగనీ, పిల్లలు పెట్టనీ" అని నవ్వింది అనంతలక్ష్మి.

"అయితే, ఇప్పుడు నాగపూర్‌లో కొడుకు దగ్గర వారం రోజులైనా ఉండాలని ప్లాన్ వేసుకున్నట్లు లేదే. ప్లాస్టిక్ బ్యాగ్‌లో మారు చీర కూడా ఉందో

లేదో నాకు అనుమానమే" అంది అనూరాధ.

"బాగా చెప్పారు అమ్మగారూ. ఈ మధ్యాహ్నం ఉండి రేపు పొద్దున్నే వెళ్ళిపోతే చాలా ఎక్కువ సేపు ఉన్నట్లు" అంది అనంతలక్ష్మి.

"కుర్రవాడు హాస్టల్లో ఉన్నాడు గదా. మీకక్కడ ఉండడానికి వసతి లేకపోవచ్చును" అన్నాడు రావు.

"అయ్యో, ఇంకా నేను చెప్పలేదు. మూడు నెలలైంది బాబుగారూ వాడు ఓ ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. కట్టుకున్న భార్యతో ఆ ఇంట్లోనే హాయిగా కాపురం చేస్తున్నాడు. ఆ అమ్మాయి ఏదో ఉద్యోగం చేస్తోందట" అంది అనంతలక్ష్మి.

అనూరాధ ఉత్సుకత ఎదిగింది.

"అలాగా. అబ్బాయి పెళ్ళి చేసేశావన్నమాట. చాలా సంతోషం."

అనంతలక్ష్మి ఇంకా నవ్వుతూనే, "అంతా మంచిదే అమ్మగారూ. నాలుగు నెలల క్రితం ఒకనాడు ఒక అమ్మాయిని తీసుకుని నా దగ్గరకు వచ్చాడు. నాకు పరిచయం చేశాడు. 'అమ్మా, నువ్వు ఒప్పుకోవాలి. నేను ఈ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటున్నాను' అన్నాడు. నేను ఒప్పుకోనని వాడికేం అనుమానం లేదు. ఒప్పుకోకూడదని నాకేం అభ్యంతరం లేదు. వాడి పెళ్ళి వాడి ఇష్టం. అందరూ కులాసాగా ఉండడమే నాకు కావలసింది. చాలా క్లుప్తంగా పెళ్ళి చేసుకున్నాడు. నా చేత అనవసరమైన ఖర్చేం పెట్టించలేదు. ఆ అమ్మాయి తల్లితండ్రుల దగ్గర కూడా డబ్బు, దస్కం ఏమీ తీసుకోలేదు. పెళ్ళయిన వారం రోజులకే ఆ ఇల్లూ, సంసారం ఏర్పాటు చేసుకున్నాడు. హాయిగా ఉన్నాడు. వాడి గురించి నాకేం దిగుల్లేదు."

"అమ్మాయి అనుకూలంగా ఉంటుందా" అనడిగింది అనూరాధ.

"మంచి, మర్యాద తెలిసిన పిల్లలాగానే కనిపించింది. అయినా, నేనా పిల్లను చూసింది పెళ్ళయిన మొదటి వారంలోనే. తరువాత వాళ్ళకు బలార్‌షా రావడానికి కుదరలేదు, నాకు నాగపూర్ పోవడానికి అంతకన్నా వీలుకాలేదు. అందుకనే ఇప్పుడు ఇలా హఠాత్తుగా బయలుదేరా. మూడు నెలలైపోయింది. వాడి దగ్గర్నుంచి ఉత్తరాలే తప్ప

> బొత్తిగా పూర్వ పరిచయం లేనివాళ్ళు, తాత్కాలికంగా అప్యాయత, ఆత్మీయత కుమ్మరించుకోవడం రావుకు అర్థంకాని ఒక జీవన విధాన పద్ధతి.

ముఖ దర్శనం లేదు. వాడిని చూడకుండా వరుసగా ఒక నెల రోజులు నేనెప్పుడూ ఉండలా ఇంతవరకూ. వాడికి తల్లి మీద బెంగలేదేమోగాని నాకుమాత్రం బిడ్డ మీద బెంగ ఎక్కువైపోయి, చెప్పాచెయ్యకుండా బయలుదేరా ఇప్పుడు చూసివద్దామని" అని క్షణం తటపటాయించింది అనంతలక్ష్మి.

అనూరాధ వినడానికి చెవులు నిక్కబొడుచుకుని కూర్చుంది. రావు దృష్టంతా పుస్తకాలమీదే అయినా ఒక చెవి ఇటే వదలి ఉన్నాడు. పుస్తకం మడిచి ఒడిలో పెట్టుకుని కొంచ్త ముందుకు జరిగాడు.

"మరో పాయింట్ కూడా ఉంది. అది తేల్చుకుందామనే వెళుతున్నాను ఇప్పుడు" అంది అనంతలక్ష్మి.

"ఏమిటది" అని అడగకుండా ఉండలేకపోయింది అనూరాధ.

"నా కడుపులో బాధ మీకు చెప్పుకుంటే పోతుంది అక్కగారూ. మూడు నెలల నుంచి అబ్బాయి నాకు డబ్బు పంపడమే లేదు. ఉత్తరాలలో కూడా దాని ప్రసక్తే తీసుకురావడం లేదు. అలాంటి ఏర్పాటే తనకు తెలియనట్లుగా ప్రవర్తిస్తున్నాడు. దానికి కారణం కనుక్కుందామని. అంతే."

"వాడి డబ్బు మీకు అవసరం లేదుగా. ఆ డబ్బు లేకపోయినా మీకేం ఇబ్బంది అవదు గదా" అన్నాడు రావు.

"అవును బాబుగారూ. నిజం. వాడు పంపుతున్నది వాడి పేరనే డిపాజిట్ చేస్తున్నానని చెప్పాను కదూ. అంతేకాదు, వాడు పంపకపోయినా ఈ మూడు నెలలూ నా డబ్బే వెయ్యి రూపాయలు ప్రతి నెలా ఆ ఖాతాలో కట్టేస్తున్నాను. ఇంతకూ నాకు తేలాల్సిన పాయింట్ ఒకటుంది. దాని కోసం వెడుతున్నాను ఇప్పుడు" అంది అనంతలక్ష్మి బరువుగా ఊపిరి వదులుతూ.

రావు నవ్వేసి పుస్తకం చేతుల్లోకి తీసుకున్నాడు.

"కొత్త కాపురం. వాళ్ళకు ఎన్నో ఖర్చులుంటాయి. మీకు పంపలేదని ఎందుకు కోపం" అంది అనూరాధ.

"కోపం కాదు. నాకేం కోపం లేదు. కారణం కావాలి, అంతే. ఖర్చులు ఉంటాయని నాకూ తెలుసు. అందుకోసం నేను డబ్బు ఇస్తానన్నాను. వద్దంటే వద్దన్నాడు వాడు. 'అవసరం అయితే అడిగి తీసుకుంటా కదా' అన్నాడు. 'ఇట్లా నీకు వెయ్యి రూపాయలు పంపనమ్మా ఇక నుంచి' అని ఒక్కమాటా అన్లేదు. ఎందుకు అన్లేదు వాడు? దానికి జవాబు కావాలి నాకు. అంతే."

ఊఁ. చెప్పండి సొంతం అన్నట్లు చూశాడు రావు ఆమె వంక.

"మరేం లేదు. నాకు డబ్బు పంపవద్దని ఆ అమ్మాయి వాడిని కట్టడి చేసిందా? అందుకే వాడు పంపడం లేదా? దీనికి నాకు నిజమైన సమాధానం కావాలి. అంతే."

అనూరాధ రావు ముఖం వంక చూసింది.

రావు ఆమె కళ్ళలోకి చూశాడు. తరువాత అనంతలక్ష్మి వైపు తిరిగి, "చూడమ్మా. ఎందుకు ఊరికే హైరానా పడతావు? అన్ని ప్రశ్నలకూ మనకు సమాధానాలు దొరక్కపోతేనేం? జరుగుతున్నదానికి కారణాల కోసం వెదకడం ఎందుకు? అందులోనూ అలాగే జరిగి తీరాలని మనకు మనసులో లేనప్పుడు? హాయిగా ఉండు. అనవసరంగా మనసులో బూజు చేర్చుకోకు. వాళ్ళు నీ కొడుకూ, కోడలూ కదా. వాళ్ళు ఎలా చేసినా, ఏం చేసినా నీకెందుకు బెంగ? నీకెందుకు వెదుకులాట" అన్నాడు నింపాదిగా, గంభీరంగా.

అనంతలక్ష్మి అతని ముఖంలోకే చూస్తూ ఉండిపోయింది.

అతని కళ్ళలో ఆమెకు కొత్త వెలుగులు, ఆ వెలుగుల్లో తనకు సమరస సమాధానాలు అగుపిస్తున్నాయి. ఇంకా కలుగులు వెదకడం దేనికి?

అకస్మాత్తుగా వివేకోదయం అయినట్లు అనిపించింది ఆమెకు.

రావుకు నమస్కారం చేసి, అనూరాధ చేతులు తన చేతుల్లోకి తీసుకుంది.

"అలాగే బాబుగారూ. నా సందేహాలన్నీ మరచిపోతాను. మళ్ళీ మనసులోకి రానీయను" అంది.

ఒక్క క్షణం ఆగి, "అమ్మాయికీ, అబ్బాయికీ కొత్త బట్టలు కొనుక్కువెళతాను దారిలో. వాళ్ళ చేత కట్టించి, ఈ సాయంకాలం విందు భోజనం తయారు చేసి తినిపిస్తాను. నా కళ్ళు తెరిపించారు. నా హృదయంలో కొత్త రహదార్లు గీశారు. మీ ఋణం తీర్చుకోలేను" అంటూ అనూరాధ చేతులు తన కళ్ళకు అద్దుకుంది.

నాగపూర్ స్టేషన్‌లో రైలు ఆగాక అనంతలక్ష్మి దిగిపోతూ రావుకు పాదాభివందనం చేసింది. తన ముఖంలో ప్రశాంతత స్థాయిగా నిలదొక్కుకోవడం ఆమెకు తెలియదు. ■

# అంతరంగ పరివేదన

## ఒక ఒంటరి దిగులు మేఘం మౌనంగా కురిపించిన వర్షం



**మట్టిపువ్వు**
రచన: యార్లగడ్డ రాఘవేంద్రరావు
ప్రతులకు: శ్రావ్య పబ్లికేషన్స్, బి-22, మధురా నగర్, హైదరాబాద్-38;
పేజీలు: 105.
వెల: రూ. 25/-

పసునూరు శ్రీధర్‌బాబు

*అసలు దుఃఖాన్ని మించిన భాష ఉందా?*
*అది కంటిపాప లోకాన్ని కలగనక ముందే*
*గొంతు విప్పిన తొలిపాట*

మనం ఎప్పటికప్పుడు కొత్తగా చదువుకునే ప్రాచీన భాష అంటాడు యార్లగడ్డ రాఘవేంద్ర రావు *గుండెగంగ* కవితలో. బాధలాగా ఏకాంతాన్ని సాంద్రం చేసే శక్తి మరిదేనికీ లేదేమో! ఆ బాధ లోలోపల ఒక తడి మంటగా మారి కవిని నానా బీభత్సానికి గురిచేసి కవిత్వమై వెలుగు చూస్తుంది. ఇంతకీ బాధ ఎందుకంటే-

*అప్పుడప్పుడు స్వప్నాల్ని అమ్మే వాళ్ళు వస్తుంటారు*
*ఎప్పుడైనా ఒక స్వప్నాన్ని కొనుక్కొని*
*దిండు కింద భద్రంగా దాచుకుంటామా*
*తెల్లారేసరికి*
*ఎవరో దాని శకలాలతో ఆడుకుంటుంటారు-*

కలలు పగిలిన అలికిడిలో కవిత్వాన్ని తడుముకుంటున్న రాఘవేంద్రరావు సున్నితమైన అనుభూతులను అందమైన పదచిత్రాలలో సమర్థంగా బంధిస్తాడు. మనిషికీ మనిషికీ మధ్య దూరం పెరుగుతోందన్న దిగులులోంచి ఆయన 'రెండు శ్వాసల మధ్య'లో ఇలా పరితపిస్తాడు: *సంభాషణ ముగిశాక మనసు కదిలిన జ్ఞాపకమూ మిగలదు/ ....ఎప్పుడూ చెట్టు జాడ దొరకని పక్షి ఆదుర్దా లాంటి ఆదుర్దా/ ....... జీవితం దూరంగా కదిలే కల/ మనిషి.... నీటిలో నల్లమబ్బు నీడ.*

ఈ కవిత్వమంతా ఒక అంతరంగ పరివేదన. ఒక రాహిత్య స్పృహ. దేన్నో పోగొట్టుకున్న దైన్యం. ఈ అక్షరాల్లోంచి ప్రయాణిస్తుంటే అర్థం కాని బెంగ *ఏదో/ పెంపుడు కుక్కలా కాళ్ళకడ్డం పడుతుంది. గుండె కింది ఏక్‌తార రాగం సొగసుగా చుట్టేసుకుంటుంది.*

*గుప్పెడంత గుండెలో/ ఆకాశమంత ఏకాంతాన్ని* అనుభవిస్తున్న రాఘవేంద్రరావు ఇందులో దాంపత్య సంబంధాల ప్రేమరాహిత్యాల గురించి (*ఎవరికి వారే ఒక ద్వీపంగా, దృశ్యం చీలిపోయి, తలుపులు తెరుద్దాం*), తలిదండ్రుల ఒంటరితనం గురించి (పక్షులు ఎగిరి వెళ్ళిపోయాక) రాసిన కవితలు చాలా డిస్టర్బ్ చేస్తాయి.

*అప్పుడే వెలసిన వాన వేళ/ షికారుకెళ్ళిన హాయిని, వెదురు పొదల్లో నిదుర లేచిన గాలిలాంటి* యవ్వనాన్ని అక్షరబద్ధం చేసిన ఈ కవి, ఆనందాలకీ టాగ్‌లు తగిలించారని, *పంచతంత్రం మీద డొనాల్డ్‌డక్ రెట్ట* వేసి పోతోందని పెట్టుబడిదారీ సాంస్కృతిక దాడిపై వ్యంగ్యంగా విరుచుకుపడతాడు. పత్తి రైతులతో సహా ఈ నేలమీది మట్టి పువ్వులందరిలోనూ రాఘవేంద్రరావు తన నాన్నను చూసుకుని కలతపడి, కవిత్వమయ్యాడు. సంతోషం కన్నా ఒకరి బాధను పంచుకోవడంలోనే గొప్ప ఆనందం ఉంది. ఈ కవిత్వం చదువుతుంటే ఈ ఆనందమే కలుగుతుంది. ■